రాజీనే రాజమార్గం

11వ అదనపు జిల్లా జడ్జి సికిందర్ భాషా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేసులు పరిష్కరించుకోవడంలో రాజీ మార్గమే రాజ మార్గమని 11వ అదనపు జిల్లా జడ్జి సికిందర్ భాషా తెలిపారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థల ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం కోర్టు సముదాయంలో మార్చి 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌లో క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, గృహహింస, చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించబడతాయని పేర్కొన్నారు. కక్షిదారులు కేసుల నుంచి విముక్తి కావడానికి ఈ లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖ..

రూటే వేరు..!

- డిప్యూటేషన్ల రద్దుకు హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాలు
- జిల్లా వైద్యఆరోగ్యశాఖలో అమలుకాని పరిస్థితి
- డిఎంహెచ్ఒ కార్యాలయంలోనే డిప్యూటేషన్లపై దాదాపు 20 మంది
- మెడికల్ ఆఫీసర్‌కు అడ్మినిస్ట్రేటివ్ బాధ్యతలా..?
- ఉన్నతాధికారుల ఆదేశాలపై లెక్కలేనితనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా వైద్యఆరోగ్యశాఖ రూటే వేరు అని మరోసారి రుజువైంది. ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలు సైతం ఇక్కడ అమలుకాని పరిస్థితి ఉంది. 'మాకు నచ్చినట్టే చేస్తాం..ఎవరేం చెప్పినా డోంట్‌కేర్' అన్నట్లు ముందుకు సాగుతున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. వైద్యఆరోగ్య శాఖలో డిప్యూటేషన్లపై జిల్లావ్యాప్తంగా పని చేస్తున్న అధికారులు, సిబ్బందిని ఎవరి స్థానాలకు వారిని పంపించాలని, వెంటనే అందుకు సంబంధించిన చర్యలు చేపట్టాలని గత జనవరిలో ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు. జనవరి నెలాఖరున డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారులు సైతం డిప్యూటేషన్లు రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే జిల్లాలో ఇప్పటి వరకూ డిప్యూటేషన్లపై ఎటువంటి చర్యలూ తీసుకోని పరిస్థితి కన్పిస్తోంది. వైద్యఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇచ్చిన ఆదేశాల మేరకు తొలుత ప్రస్తుతం కొనసాగుతున్న డిప్యూటేషన్లను రద్దు చేయాల్సి ఉంది. ఏ అధికారినైనా డిప్యూటేషన్‌పై తెచ్చుకోవాలంటే సంబంధిత కారణాలను కూలంకుషంగా రాసి పంపించి రాష్ట్ర అధికారుల అనుమతి తీసుకోవాలని స్పష్టంగా పేర్కొంది. దీంతో ఏదైనా అవసరం ఉంటే అనుమతి తీసుకోవాలనే మాటను ఇక్కడి అధికారులు తమకు అనుకూలంగా మార్చుకుని, డిప్యూటేషన్లు రద్దు చేయకుండా ముందుకు సాగుతున్నారనే చర్చ ఆ శాఖలో కొనసాగుతోంది. ఈ శాఖలో పెద్దఎత్తున సిబ్బంది డిప్యూటేషన్లపై తమకు నచ్చిన చోట వేయించుకుని కొనసాగుతున్నారు. జిల్లా కేంద్రంలోని డిఎంహెచ్ఒ కార్యాలయంలోనే దాదాపు 20 మంది డిప్యూటేషన్లపై కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ ఎటువంటి అవసరమూ లేకపోయినా డిప్యూటేషన్లపై చాలామంది ఉన్నట్లు సమాచారం. డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఎంపిహెచ్ఇలు ముగ్గురు, ఎంపిహెచ్ఎస్ ఒకరు, ఎంపిహెచ్ఎ ఎఫ్-1, సీనియర్ అసిస్టెంట్లు ముగ్గురు, ఫార్మాసిస్టులు ఇద్దరు, మెడికల్ ఆఫీసర్లు ముగ్గురు, అటెండర్లు ముగ్గురు, ఎఫ్ఎన్ఒ ఒకరు, ఎంఎన్ఒ ఒకరు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఇద్దరు డిప్యూటేషన్లపై కొనసాగుతున్నట్లు సమాచారం. డిప్యూటేషన్ల తతంగమంతా సొమ్ములతో నడుస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులకు సొమ్ము ముట్టజెప్పి పోస్టింగ్ ఇచ్చిన చోట చేయకుండా జిల్లా కేంద్రంలో ఉండిపోతున్నట్లు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా డిప్యూటేషన్లపై పని చేస్తున్న వారు పెద్దసంఖ్యలో ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. సిబ్బంది కొరత ఉండి అవసరం ఉంటే రాష్ట్ర అధికారులకు తెలియజేసి నియమించుకోవచ్చు. జిల్లాలో మాత్రం అలా జరగడం లేదు. ఇష్టానుసారంగా డిప్యూటేషన్ల వ్యవహారం నడుస్తుందనే విమర్శలు ఉన్నాయి. దీనిలో డిఎంహెచ్ఒ కార్యాలయంలో కొంతమంది చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. కొంతమంది కింగ్‌మేకర్లుగా మారి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులను తప్పుదోవలో నడిపిస్తున్నారనే చర్చ సైతం నడుస్తోంది. జిల్లా వైద్యఆరోగ్యశాఖపై కలెక్టర్ దృష్టి సారిస్తే తప్ప సమస్యలు పరిష్కారమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. అసలు ఆ శాఖలో ఏం జరుగుతుందనే చర్చ ప్రజల్లో నెలకొంది. వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్న వైద్యఆరోగ్యశాఖను కూటమి ప్రభుత్వంలోనైనా సరిదిద్దుతారో.. లేదో వేచిచూడాలి.

మెడికల్ ఆఫీసర్‌కు అడ్మినిస్ట్రేటివ్ బాధ్యతలా..!

ప్రభుత్వం ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రతి పిహెచ్‌సికి ఇద్దరు మెడికల్ ఆఫీసర్లను నియమించింది. ఒకరు ఆసుపత్రిలో రోగులను చూస్తే, మరొకరు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో పని చేయాల్సి ఉంటుంది. పిహెచ్‌సిలో మెరుగైన వైద్యసేవలకు అడ్డంకి సృష్టిస్తూ పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లను డిఎంహెచ్ఒ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పని చేయిస్తున్నారు. మెడికల్ ఆఫీసర్లను అడ్మినిస్ట్రేటివ్ అధికారులుగా నియమిస్తున్న తీరు మరింత చర్చనీయాంశంగా మారింది. ఒక మెడికల్ ఆఫీసర్‌కు అడ్మినిస్ట్రేటివ్ బాధ్యతలు ఏవిధంగా అప్పగిస్తారో.. దాన్ని ఏవిధంగా సమర్ధించుకుంటారో సదరు అధికారులే చెప్పాల్సి ఉంది. ఏదేమైనా వైద్య ఆరోగ్యశాఖలో డిప్యూటేషన్ల వ్యవహారం వివాదస్పదంగా మారుతోంది. సమస్యను సరిచేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం డిప్యూటేషన్లను రద్దు చేసి, రాష్ట్ర ఉన్నతాధికారుల అనుమతితో ముందుకు సాగేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటారో, లేదో వేచిచూడాలి.

కొన్ని డిప్యూటేషన్లపై వరుస క్రమంలో చర్యలు

ఆర్.మాలిని, డిఎంహెచ్ఒ

డిప్యూటేషన్లకు సంబంధించి వరుస క్రమంలో కొన్ని చర్యలు తీసుకుంటున్నాం. అన్ని డిప్యూటేషన్లను రద్దు చేయాలని చెప్పలేదు. రాష్ట్రం నుంచి కొన్ని అనుమతి ఉన్నవి ఉన్నాయి. అంతేకాకుండా అవసరమైనచోట కొనసాగించవచ్చుకోవచ్చునన్నారు. అనవసరమైనవి ఉంటే పరిశీలించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొన్ని ఖాళీలు ఉన్నాయి. పనులు ఆగకుండా ముందుకు సాగడం కోసం నియమించుకోవడం జరిగింది. వచ్చే నెలలో కొంతమంది సిబ్బంది వస్తారని చెబుతున్నారు. వస్తే ఖాళీలు భర్తీ అవుతాయి. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అనుమతి తీసుకుని ఉంచుతాం. ఎవరైనా వస్తే రిలీవ్ చేస్తామని జిల్లా కలెక్టర్‌కు కూడా లెటర్ పెట్టి అనుమతి అడుగుతాం.

దొడ్డిపట్లలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

రూ.8 కోట్లతో ఏటిగట్టు పటిష్ట పనులు

జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - యలమంచిలి

నాడు జగన్ ఐదేళ్ల పాలనలో గోదావరి ఏటిగట్టును పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, నేడు చంద్రబాబు పాలనలో అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మండల పరిధిలో రూ.ఎనిమిది కోట్ల వ్యయంతో చేపట్టిన గోదావరి ఏటిగట్టు పటిష్ట పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా దొడ్డిపట్లలో మంత్రి రామానాయుడు విలేకరులతో మాట్లాడారు. వరదొస్తే బూరుగుపల్లి వద్ద గోదావరి ఏటిగట్టుకు గండ్లు పడి పది, పన్నెండు మండలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని గుర్తించి 2014-19 టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.6 కోట్లు నిధులు మంజూరు చేసి గ్రోయిన్స్ నిర్మాణంతో అడ్డుకట్ట వేశామని గుర్తు చేశారు. 2019-24 వైసిపి ప్రభుత్వంలో రూపాయి పని, తట్ట మట్టి పనులకూ నోచుకోకపోవడంతో వరద వచ్చిన సమయంలో బలహీనంగా ఉన్న గట్లు వద్ద గండ్లు పడకుండా వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు, యువకులు కలిసి రాత్రింబవళ్లు కాపలా కాసి ట్రాక్టర్లపై ఇసుక, సంచులు, బాదులు వంటివి సైతం సమకూర్చుకుని కాపాడుకున్నారని గుర్తు చేశారు. నిధుల సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ చంద్రబాబు గోదావరి ఏటిగట్టు పటిష్ట పనులకు రూ.8 కోట్లు మంజూరు చేశారని మంత్రి రామానాయుడు వివరించారు. గత వైసిపి ప్రభుత్వంలో రోడ్డెక్కి పోరాటం చేస్తేగాని వరద సాయం అందేది కాదని, నేటి కూటమి ప్రభుత్వంలో వరద నీరు గడప వద్దకు వస్తుందని తెలిసిన వెంటనే సాయం అందించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఇరిగేషన్ అత్యవసర పనుల నిమిత్తం చంద్రబాబు మంజూరు చేసిన రూ.320 కోట్ల మేర నిధులతో చేపట్టిన పనులను మార్చి నెలాఖరులోగా పూర్తయ్యేలా దృష్టి పెట్టామన్నారు. ఏటిగట్లను బలోపేతం చేయడం, డ్రెయిన్లలో పూడికతీత పనులు, గేట్లు, షట్టర్లు, లాకులు, రోప్‌లు వంటి అత్యవసర పనులను చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గోదావరి ఏటిగట్టు కన్జర్వేన్సీ ఇంజినీరింగ్ అధికారులు, నాయకులు బోనం నాని, మామిడి శెట్టి పెద్దిరాజు, ఆరిమిల్లి రామ శ్రీనివాసరావు, రుద్రరాజు సత్యనారాయణరాజు, బొప్పన హరికిషోర్, చిట్టూరి రామాంజనేయులు, చేగొండి రవిశంకర్, దేగల సత్తిపండు, తోలేటి చంటి, గుబ్బల మోహన్‌రావు, సేరు కృష్ణ, పాలపర్తి మాధవరావు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి రాఘవులును గెలిపించాలి

ప్రజాశక్తి - తణుకు

పేద, బడుగు బలహీన వర్గాల గొంతు విన్పించేందుకు పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ విద్యావంతులకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ఆదివారం వివిధ సంస్థల్లోని గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ పిడిఎఫ్ అభ్యర్థులకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. 2007లో పిడిఎఫ్ తరపున పోటీ చేసిన చుక్కా రామయ్య నుండి ప్రస్తుత సిట్టింగ్ ఎంఎల్‌సిలు ఇళ్ల వెంకటేశ్వరరావు, బి.గోపీమూర్తి, కెఎస్.లక్ష్మణరావు వరకు అంతా రాష్ట్రంలోని ఉద్యోగులు, కార్మికులు, పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువజనుల సమస్యలపై శాసనమండలిలో, బయట పోరాటం సాగించారని తెలిపారు. దిడ్ల వీర రాఘవులు ఇప్పటి వరకు ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారన్నారు. ప్రతి ఓటరూ సమస్యల పరిష్కారం కోసం పని చేసే పిడిఎఫ్ అభ్యర్థికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, రామకృష్ణ, శివకుమార్, శర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రతాప్

కొడమంచిలిలో ఇంజన్ ద్వారా వరి పొలానికి నీటి తోడకం

నీరందదు.. చేను తడవదు..!

శివారు భూములకు నీరందక రైతుల అవస్థలు

ప్రజాశక్తి - ఆచంట

దాళ్వా రైతులను సాగునీటి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. రైతులు దాళ్వా సాగు ప్రారంభం నుంచి నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. తాజాగా శివారు ప్రాంతాలకు నీరందక చేను తడవక బీటలు వారుతున్నాయి. ఆచంట వేమవరం, పెనుమంచిలి, వల్లూరు, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, భీమలాపురం, శేషమ్మ చెరువు తదితర గ్రామాల్లో రైతులు సాగునీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు రెండు రోజులుగా ఎండల తీవ్రత అనూహ్యంగా పెరిగింది. నియోజకవర్గంలో వంతులవారీ విధానం అమల్లోకి వచ్చింది. దీంతో శివారు భూముల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎండల తీవ్రత కారణంగా పలుచోట్ల వరి పొలాలు నెర్రలు తీయడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ఈ తరహాలో మండలంలో ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు వల్లూరు, కోడేరు పెద్దమలం, కరుగోరుమిల్లి, కొడమంచిలి తదితర గ్రామాల పరిధిలోని శివారు ప్రాంతాల్లో సాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో ఆయా ప్రాంతాల్లో రైతులు పొలాలను కాపాడుకోవడానికి బోర్లను ఆశ్రయిస్తున్నారు. డెల్టా ఆధునికీకరణ ఎప్పుడు చేపడతారు, ఎప్పుడు తమ కష్టాలు గట్టెక్కుతాయా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈలోపు తాత్కాలిక ప్రాతిపదికనైనా శివారు భూములకు సమృద్ధిగా నీరందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్య ద్వారానే సమాజ ప్రగతి

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు



మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేసిన మంత్రి నిమ్మల రామానాయుడు

విద్య ద్వారానే సమాజ ప్రగతి సాధ్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు నియోజకవర్గంలోని కాపు, తెలగ కుటుంబాల్లోని 329 మంది పేద విద్యార్థులకు రూ.13 లక్షలు విలువైన ఉపకార వేతనాలను ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్‌లో అందించారు. గుంటూరుకు చెందిన కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ ప్రివిలేజ్డ్ వ్యవస్థాపకులు తులసీ రామచంద్ర ప్రభు రూ.6.5 లక్షలు ఇవ్వగా, అంతే మొత్తాన్ని పాలకొల్లులో దాతల నుంచి విరాళాల రూపంలో సేకరించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పేదలైన మెరిట్ విద్యార్థులకు ఈ విధంగా ప్రోత్సాహకం అందజేయడం అభినందనీయమన్నారు. దాత తులసి ప్రభు మాట్లాడుతూ తాను ఇంతవరకు 40 పట్టణాలు, గ్రామాల్లో రాష్ట్రవ్యాప్తంగా గత 20 సంవత్సరాల్లో రూ.40 కోట్లకుపైగా సొమ్ము విద్యార్థులకు అందించినట్లు చెప్పారు. తాను స్కాలర్‌షిప్‌తోనే చదివానని, అందుకే పేద విద్యార్థుల వెతలు తనకు తెలుసని చెప్పారు. ఇంకా ఎక్కువ మొత్తంలో విరాళాలు సేకరిస్తే, తాను ఇంకా ఎక్కువ మొత్తం ఇస్తానని హామీ ఇచ్చారు. పాలకొల్లులో వంగా నరసింహారావు వంటి వృద్ధులు ఎంతో ఉత్సాహంగా విరాళాలు సేకరిస్తున్నారని అభినందించారు. మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ బాబ్జీ రూ.50 వేలు విరాళం ఇచ్చి మాట్లాడారు. దాతలను ఘనంగా సత్కరించారు.

గోపవరంలో విషాదం

నీటి తొట్టెలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - ముసునూరు

నీటి తొట్టెలో పడి బాలుడు మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన మండలంలోని గోపవరం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన సురేష్, నాగశ్రీ దంపతులకు నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో బాలుడు ఆదివారం మధ్యాహ్నం ఇంటి వద్ద ఆడుకుంటూ ఇంట్లోని నీటి తొట్టెలో పడిపోయాడు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి తమ కుమారుడు కనిపించడం లేదని తల్లిదండ్రులు వెతకసాగారు. ఐదు గంటల సమయంలో ఇంట్లోని వారల తొట్టెలో చూడగా నీటిపై తేలియాడుతున్న బాలుని మృతదేహం కనిపించింది. దీంతో తల్లిదండ్రులు భోరున రోదించారు. బాలుని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సుజుకి యాక్సెస్ కొత్త వాహనం విడుదల : మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సుజుకి యాక్సెస్‌లో కొత్త వేరియంట్ వాహనం ప్రయాణికులకు మరింత సౌలభ్యంగా అధిక మైలేజీలో అందుబాటులో ఉందని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నగరంలోని ఓ హోటల్లో సుజుకి కంపెనీ యాక్సెస్ వేరియంట్లో కొత్త వాహనాన్ని విడుదల చేసింది. ఆ వాహనాన్ని మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఎస్ఎంఆర్.పెదబాబు, ఆర్‌టిసి రీజియన్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు. తొలుత ఈ వాహనాన్ని లాంఛనంగా ప్రారంభించిన మంత్రి వినియోగదారురాలికి అందజేశారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ నూతన సుజుకి వాహనం మోడల్‌పరంగాను, మైలేజ్ పరంగాను కంపెనీ ఎంతో అద్భుతంగా డిజైన్ చేసిందన్నారు. నగరంలో ఉన్న శ్రీ కృష్ణ సుజుకి సంస్థ యజమాని నారా శేషుకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ సుజుకి సంస్థ యజమాని నారా శేషు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

సుజికీ కొత్త వేరియంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

ప్రమాదకరమైనా.. పట్టించుకోరా..!

అనాకోడేరు వంతెనకు రక్షణ గోడ కరువు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రహదారి భద్రతా వారోత్సవాలు అంటూ అధికారులు అంతా ఊదరగొడుతున్నారు. కానీ ప్రమాదాలకు కారణమవుతున్న సమస్యలపై మాత్రం జిల్లా అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భీమవరం నుండి అనాకోడేరు వెళ్లే మార్గంలో అనాకోడేరు హైస్కూల్ వద్ద ఉన్న కాల్వపై వంతెన ఉంది. ఈ వంతెనకు ఉన్న సైడ్ వాల్స్ (రక్షణగోడలు)కు ఒకవైపు గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో శిథిలమైంది. ఆ రక్షణ గోడ పునర్నిర్మించాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నా పట్టించుకున్న దాఖలాల్లేవనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇక్కడ హైస్కూల్‌కు కొమరాడ గ్రామం నుండి విద్యార్థులు సైకిళ్లపై నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఆదమరుపునగాని, అదుపుతప్పిగాని వీరు కాల్వలో పడే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. సమీపంలోనే మద్యం దుకాణం ఉండటం, మందుబాబులు కాల్వపక్కనే ఉన్న ఖాళీ స్థలాల్లో మద్యం సేవించడం పరిపాటిగా మారింది. మందుబాబులు మద్యం మత్తులో వంతెనపై నుంచి కాల్వలో పడే ప్రమాదమూ పొంచి ఉంది. దీంతో పాటు ఈ మార్గంలో నిత్యం పెద్దసంఖ్యలో చేపలు, రొయ్యల చెరువులకు సంబంధించి మేత తీసుకెళ్లే భారీ లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ పరిస్థితుల్లో వంతెనకు రక్షణ గోడ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెనకు రక్షణ గోడ నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వంతెనకు కానరాని సైడ్‌వాల్

సముద్ర కెరటాల్లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు పెద్దసంఖ్యలో రావడంతో సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాలపై బీచ్‌కు ఉదయమే వచ్చారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

రైతులు అగ్రిస్టాక్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

మండల వ్యవసాయ అధికారి అడబాల జ్యోషిలా

చిట్ చాట్

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి వ్యవసాయ శాఖ చేపట్టిన అగ్రిస్టాక్ రిజిస్ట్రేషన్‌ను మండలంలోని రైతులు తప్పనిసరిగా చేయించుకొని, ప్రభుత్వం ఇచ్చే ఎన్రోల్మెంట్ ఐడి పొందాలని మండలం వ్యవసాయ అభివృద్ధి అధికారి అడబాల జ్యోషిలా తెలిపారు. ఆమె ఆదివారం ప్రజాశక్తితో మాట్లాడారు.

ప్రశ్న: అగ్రిస్టాక్ అంటే ఏంటి, రైతులకు వివరించండి?

అగ్రిస్టాక్ ప్రక్రియ రైతులకు ఎంతో ఉపయోగకరం. ప్రభుత్వ ప్రయోజనాలు, సేవలు రైతులకు అందించడానికి ఇది సహాయపడుతుంది.

ప్రశ్న:ఈ విధానం వల్ల రైతులకు ఎటువంటి సేవలు అందుతాయి?

ఈ విధానం వల్ల అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ వంటి పథకాలు, ఇతర రాయితీలు రైతులకు అందుతాయి.

ప్రశ్న : అగ్రిస్టాక్‌లో చేరడానికి రైతులు ఏం చేయాలి?

రైతులు వారికి సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్, విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్స్ ను కలవాలి.

ప్రశ్న : రైతులు ఆర్ఎస్‌కెలకు వెళ్లేటప్పుడు ఏం తీసుకుని వెళ్లాలి?

పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్, ఆధార్ లింక్ అయిన ఫోన్ తీసుకెళ్లాలి.

ప్రశ్న : దీనిపై సిబ్బంది రైతులకు సమాచారం ఇచ్చారా?

వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో రైతులందినీ కలుస్తున్నారు. తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెబుతున్నారు.

30 పడకల ఆస్పత్రిగా మారేదెప్పుడో..!

ప్రజాశక్తి - తణుకు రూరల్

వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 30 పడకల ఆసుపత్రిగా ఎప్పుడు మారుతుందా అని తణుకు మండల ప్రజలు వేచి చూస్తున్నారు. ప్రస్తుతం 24 గంటల ఆసుపత్రిగా ఉన్న ఈ పిహెచ్‌సి ఒక మెట్టు పైకి ఎదిగి 30 పడకల ఆసుపత్రి అయితే తణుకు నియోజకవర్గంలోని అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాల ప్రజలతో పాటు పెనుమంట్ర మండలానికి చెందిన వారికి కూడా విస్తృత స్థాయిలో వైద్య సేవలందించడానికి అవకాశం ఉంటుంది. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా మారుస్తూ 2018 సంవత్సరంలో జిఒ 44ను ప్రభుత్వం విడుదల చేసింది. 2019 ఫిబ్రవరిలో నూతన భవన నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఆర్థిక సంవత్సరం ముగింపు, పైగా ఎన్నికల వేళ కావడంతో నిధుల విడుదల్లో కొంత జాప్యం ఏర్పడింది. 2019 మే నెలలో ప్రభుత్వం మారడంతో అప్పటికి నిర్మాణ పనులు 25 శాతం కూడా పూర్తి కాలేదనే కారణం చూపుతూ అప్పటి ప్రభుత్వం 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు నిర్ణయాన్ని రద్దు చేసింది. వేల్పూరు పరిసర ప్రాంతాల నుంచి రోజుకు 100 మంది ఈ పిహెచ్‌సిలో అవుట్ పేషంట్ వైద్య సేవలు పొందుతున్నారు. వీరిలో ఎవరికైనా మెరుగైన వైద్య సేవలు అందించాల్సి వస్తే ఆయా విభాగాల వైద్యులు లేక తణుకు ఆసుపత్రికి రిఫర్ చేయాల్సి వస్తుంది.

30 పడకల ఆసుపత్రిగా మారితే..

పడకల సామర్థ్యాన్ని బట్టి రోగులను చేయించుకోవాల్సి ఉంటుంది. 30 పడకల ఆసుపత్రిగా మారితే 30 మంది ఇన్ పేషెంట్లను పెట్టుకునే సామర్థ్యంతో పాటు ఆరుగురు వైద్యులు, ఆరుగురు స్టాఫ్ నర్సులు అందుబాటులోకి వస్తారు. రోగులకు పరీక్షలు నిర్వహించేందుకు మెడికల్ ల్యాబ్, ఎక్స్ రే విభాగం అందుకు అవసరమైన వైద్య సిబ్బంది, సహాయ సిబ్బంది నియమితులవుతారు. అత్యవసర వైద్య సేవలు కూడా అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం హెచ్‌డిఎస్ ఫండ్స్ కింద ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.1.75 లక్షల నుంచి రూ.5.80 లక్షలకు పెరుగుతుంది. ఔట్ పేషెంట్, ఇన్ పేషంట్ సేవలు మరింత విస్తృత స్థాయిలో అందుబాటులోకి వస్తాయని మండల వాసులు ఎదురుచూస్తున్నారు.

నేటి నుంచి ఇళ్ల పట్టాల పరిశీలన

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన లబ్ధిదారులకు అందజేసిన ఇళ్ల స్థలాల పట్టాలను ఈనెల 10వ తేదీ నుంచి పరిశీలించనున్నట్లు తహశీల్దార్ సందారి వెంకటేశ్వరరావు తెలిపారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వారికి ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను పరిశీలిస్తామన్నారు. ఇళ్లు నిర్మాణం చేసుకున్న వారి పట్టాల ప్రకారం యజమానులు నివసిస్తున్నదీ లేనిదీ పరిశీలించనున్నట్లు తెలిపారు. ఇళ్లలో నివాసం లేని వారిని, ఇతర ఇల్లు ఉన్న వారిని, నాలుగు చక్రాల సొంత వాహనం ఉన్న వారిని 300 యూనిట్లు పైబడి విద్యుత్ ఛార్జీలు చెల్లించే వారిని ఈ రకంగా ప్రభుత్వం విధించిన నిబంధనల మేరకు అర్హత నిర్ణయించి వివరాలను ఉన్నతాధికారులు తెలియజేస్తామన్నారు. మండలంలో 12 ప్రభుత్వ లేఅవుట్లు ఉన్నాయని, ప్రతి లేఅవుట్‌లోనూ ఈ పరిశీలన జరుగుతుందన్నారు. అత్యంత ప్రధానంగా తాళ్లకోడు 73 ఎకరాల్లో 3,200 మందికి పట్టాలు చేశామని, వాటిని ముందుగా పరిశీలిస్తామని చెప్పారు.

విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నాం

హెచ్ఎం రామలక్ష్మి

ప్రజాశక్తి - ఉండి

పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రతి విద్యార్థికీ ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నామని ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఏలూరుపాటి రామలక్ష్మి అన్నారు. ఆదివారం ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ శత వసంతాల చరిత్ర కలిగిన తమ పాఠశాలలో 137 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారని వారిని ఎ, బి, సి, డి గ్రేడ్లుగా విభజించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఎ, బి గ్రేడ్ విద్యార్థులకు పూర్తి పాఠ్యాంశాలు క్షుణ్ణంగా చదివించడం జరుగుతుందని, సి, డి గ్రేడ్ విద్యార్థులకు ముఖ్యమైన ప్రశ్నలు చదివించడంతోపాటు జిల్లా అధికారులు ఇచ్చిన ప్రశ్నాపత్రాలను చదివించడం జరుగుతుందని తెలిపారు. ఆదివారం కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించి వారితో పాఠ్యాంశాల్లోని ప్రశ్న, జవాబులను రాయించడం జరుగుతుందని దీనివల్ల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని తెలిపారు మండల స్థాయిలో తమ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి ప్రీ పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ర్యాలీ చేస్తున్న వక్తలు

ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత

హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత అని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి గుడ్డ సంచులను వినియోగించాలని భీమవరం బాలుర బిసి హాస్టల్ వార్డెన్ కడలి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించి దాతల సహకారంతో హాస్టల్‌కు స్టీల్ గ్లాస్‌లను అందజేశారు. ప్లాస్టిక్‌ను విపరీతంగా వినియోగించడం వల్ల కేన్సర్ ప్రబలుతోందని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను బాధ్యతగా నిషేధించాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టి ఆరోగ్య వంతమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. అనంతరం ప్లాస్టిక్ రహిత సమాజ ప్రతిజ్ఞ నిర్వహించి పోలీస్ బొమ్మ సెంటర్ నుంచి ప్రకాశం చౌక్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చక్రవర్తి హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

రఘురామకు దళితులంటే చిన్నచూపు తగదు

దళిత సంఘాల జెఎసి నేతలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

బాధ్యతగల పదవిలో ఉన్న ఎపి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు దళితులంటే చులకన అని దళిత సంఘాల జెఎసి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరులోని ఇండోర్ స్టేడియం వద్ద ఉన్న లేడీస్ లయన్స్ క్లబ్‌లో దళిత జెఎసి నాయకులు ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఐఆర్ఎస్ సంజీవ్ మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆకివీడులో చెరువుల అక్రమణ తొలగించడంతో నిరాశ్రయులైన దళితులు, బడుగు బలహీన తరగతుల వారిని పరామర్శించేందుకు ఎయిమ్ నాయకులు వెళ్తే వారు విద్వేషాలను రెచ్చగొట్టేందుకు వచ్చారని తప్పుడు ప్రచారాలు చేశారన్నారు. ఈ తప్పుడు ప్రచారాలను ఖండిస్తున్నట్లు చెప్పారు. ఆక్రమణల తొలగింపు బాధితులను పరామర్శించేందుకు ఎయిమ్ నాయకులు వెళ్తే తప్పేంటని ప్రశ్నించారు. ఎయిమ్ స్టిక్కర్లు ఉన్న వాహనంలో దళిత నేతలు అక్కడకు వెళ్లడం నేరమెలా అవుతుందని ధ్వజమెత్తారు. రఘురామకృష్ణంరాజు తన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి సీనియర్ ఐపిఎస్ అధికారి పివి.సునీల్‌కుమార్‌పై అవాక్కులు చవాక్కులు మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి దానిని సునీల్‌కుమార్‌కు ఆపాదించడం రఘురామకృష్ణంరాజుకు అలవాటైపోయిందని ధ్వజమెత్తారు. దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్న సునీల్‌కుమార్‌పై, దళిత సమస్యలపై పోరాటం సాగిస్తున్న ఎయిమ్‌పై రఘురామకృష్ణంరాజుకు ఎందుకంత అక్కసు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సునీల్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలని రఘురామకృష్ణంరాజు డిమాండ్ చేయడం సిగ్గుచేటని విమర్శించారు. బాధ్యతగల పదవిలో ఉండి ఇష్టం వచ్చినట్లుగా ఆయన నోరు పారేసుకోవడం చూస్తుంటే అధికారం ఉందని రెచ్చిపోతున్నట్లుగా కనిపిస్తుందన్నారు. సిఎం చంద్రబాబు, ఎన్‌డిఎ ప్రభుత్వం అండదండలున్నాయని అవాక్కులు, చవాక్కులు మాట్లాడుతున్నట్లుగా ఉందన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎయిమ్‌పై అక్కసు కనబరుస్తూ నేతలపై కేసులు పెట్టించి వాస్తవాలు వక్రీకరించడం సరికాదన్నారు. పివి.సునీల్‌కుమార్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని, ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న రఘురామకృష్ణంరాజు అధికారం చెలాయిస్తుండడాన్ని అందరూ గమనిస్తున్నారన్నారు. గతంలో అంబేద్కర్ ఫ్లెక్సీని చించివేసినప్పుడు రఘురామకృష్ణంరాజుపై చట్టప్రకారం చర్యలు తీసుకోకుండా ప్రభుత్వంలో ఆయన భాగస్వామిగా ఉన్నారని వదిలేశారని గుర్తు చేసారు. అధికారం ఉందని దళితులపై తప్పుడు కేసులు పెట్టిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. తాటాకు చప్పుళ్లకు సునీల్‌కుమార్, ఎయిమ్ నాయకులు భయపడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్, మాల సంఘాల జెఎసి నాయకులు, ఎయిమ్ జిల్లా ప్రెసిడెంట్ వాసే ఆనంద్, డాక్టర్ మిండెం సంతోష్, అంబటి నాగేంద్రప్రసాద్, సత్యం మాస్టర్, పాము మనిసింగ్, బంటుమిల్లి హరికృష్ణ, నూకపెయ్యి కార్తీక్, మాంద్రు లాజర్, నేతల రమేష్ బాబు, ఎయిమ్ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మద్యం షాపుల లాటరీ వాయిదా

ప్రజాశక్తి - తణుకు రూరల్

తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో వచ్చిన దరఖాస్తులకు ఈ నెల 10న నిర్వహించాల్సిన లాటరీని ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా పడినట్లు తణుకు ఎక్సైజ్ సిఐ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. లాటరీ తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు.

తాడేపల్లిగూడెం : ఎంఎల్‌సి ఎన్నికల కారణంగా సోమవారం జరగాల్సిన గీత కులాల మద్యం షాపుల లాటరీ ప్రక్రియ వాయిదా పడిందని తాడేపల్లిగూడెం ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ స్వరాజ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్షన్ కమిషన్ నుంచి అనుమతి వచ్చిన వెంటనే మద్యం షాపుల లాటరీ తేదీని తెలియజేస్తామని తెలిపారు.

పెనుమంట్ర : ఈ నెల 10వ తేదీ సోమవారం జరగాల్సిన గీత కులాలకు రిజర్వు చేసిన మద్యం షాపుల ఎంపికకు సంబంధించి లాటరీ ప్రక్రియ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా పడిందని తణుకు ఎక్సైజ్ సిఐ సత్తి మణికంఠ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో లాటరీ ప్రక్రియ జరిగే తేదీ తెలియజేస్తామని, దరఖాస్తుదారులు విషయాన్ని గమనించాలని కోరారు.

నరసాపురం: నరసాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్లు గీత కార్మికులకు కేటాయించిన 3 మద్యం షాపుల టెండర్ ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు మాట్లాడుతూ నరసాపురం పరిధిలో మూడు మద్యం షాపులకు 73 దరఖాస్తులు వచ్చాయని, వాటికి లక్కీ డ్రా సోమవారం జరగాల్సి ఉండగా ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ ఉండడం వల్ల వాయిదా పడినట్లు తెలిపారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు త్వరలోనే డ్రా తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వార్డుల్లో డ్రెయినేజీల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని పలు వార్డుల పరిధిలోని ప్రధాన డ్రెయినేజీలను ఆదివారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ మురుగు సమస్య లేకుండా ప్రతి రోజూ డ్రెయినేజీలు శుభ్రం చేసే పనులను చేపట్టాలన్నారు. మురుగు నీరు లేకుండా చేయడం వల్ల దోమల సమస్య రాదని, ప్రజలు అంటూ రోగాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. డ్రెయినేజీల్లో చెత్తాచెదారం, కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు వేయకుండా ఉండాల్సిన బాధ్యత స్థానికులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేరుపాలెంలో వైద్య శిబిరం వద్ద జనం

శిబిరంలో కొనసాగిన వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించడం చాలా ఆనందంగా ఉందని గొన్నాబత్తుల ఛారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మన్ గొన్నాబత్తుల నందిని వెంకటప్రసాద్ అన్నారు. డాక్టర్ గొన్నాబత్తుల వెంకటప్రసాద్ పుట్టినరోజును పురస్కరించుకుని చేపట్టిన వైద్య శిబిరం ఆదివారం రెండో రోజు కొనసాగింది. శిబిరంలో హైదరాబాద్‌కు చెందిన స్త్రీ వైద్య నిపుణులు బి.పూజ, ఎం.పూజ, జనరల్ వైద్యులు ఆదిత్య, అభిలాష్, చంద్ర కిరణ్, అఖిల, ఆర్థోపెడిక్ వైద్యులు శ్రావణ్ కుమార్, శ్రీకాంత్ తదితరులు రోగులను పరీక్షించి సేవలందించారు. కేన్సర్, గుండె, గైనకాలజీ, ఆర్థో తదితర వైద్యులు సుమారు 900 మంది రోగులకు వైద్య సేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి మేళం బన్ను, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సమైక్యతా శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం

రామకృష్ణను సన్మానిస్తున్న కళాశాల కోశాధికారి రఘురామారావు

వైఎన్ కళాశాల జాతీయ సేవా విభాగం, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు ఘనంగా జరిగిన జాతీయ సమైక్యతా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోశాధికారి పోలిశెట్టి రఘురామారావు విచ్చేసి ప్రసంగించారు. ఈ శిబిరం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 3వ తేదీన ప్రారంభించుకొని ఆదివారం ముగించుకున్నామన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో జాతీయ సమైక్యత శిబిరం నిర్వహించడం వల్ల కళాశాల ప్రతిష్ట మరింత పెరుగుతుందన్నారు. 12 రాష్ట్రాల నుండి ఇక్కడికి విచ్చేసిన 200 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, 12 మంది పిఒ స్టాఫ్‌కు అభినందనలు తెలిపారు. ఎన్నో ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు, కట్టుబాట్లు ఉన్న దేశమే మన భారతదేశం అరాంరకె, హైదరాబాద్‌కు చెందిన ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ ఈ కార్యక్రమాల నిర్వహణలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు, వారి యాజమాన్య బృందం, ప్రిన్సిపల్ ఎంతో సహకరించారన్నారు. అనంతరం కళాశాల డీన్ గంధం శ్రీరామకృష్ణ, రాజులలంక గ్రామం ప్రెసిడెంట్ ముదునూరి మాధ్రాజు మాట్లాడారు. అనంతరం రామకృష్ణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ బి.అనసూయ, యూత్ ఆఫీసర్ సైదా నాయక్, కోశాధికారి ఎం.సంజయ్, వైఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు చింత సోమేశ్వరి పాల్గొన్నారు.

మార్చి 30న విద్యార్థులకు పురస్కారాలు

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు లియో క్లబ్ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో విద్యార్థులకు మార్చి 30వ తేదీన సేవా రత్న పురస్కారాలు అందించనున్నట్లు దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లియో క్లబ్ అధ్యక్షులు ఎన్.వైభవి తెలిపారు. విద్యార్థుల్లో సమాజం పట్ల బాధ్యతను మరింతగా పెంపొందింపజేయడానికి, సేవలందించిన వారిని ప్రోత్సహించడానికి ఈ రకమైన ప్రోత్సాహక కార్యక్రమం ప్రారంభించామని తెలిపారు. సమాజానికి అవసరమయ్యే కార్యక్రమాలు నిర్వహించి ఉత్తమ సేవలందించిన విద్యార్థులకు ఈ 'సేవారత్న' అవార్డులను అందజేస్తామన్నారు. కిండర్ గార్డెన్స్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్న విద్యార్థుల వరకూ అందరూ అర్హులేనన్నారు. పైన వివరించిన విధంగా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహించిన వారు వాటి వివరాలను ఫొటోలతో సహా పంపించాలని కోరారు. వ్యక్తిగతంగా ఎవరికి వారు మాత్రమే చేసిన అంశాలను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని, బృందంగా చేసినవి అంగీకరించబోమని ఆమె తెలిపారు. ఫిబ్రవరి నెలలో వారానికి ముగ్గురు చొప్పున మొత్తం 12 మందిని ఎంపిక చేసి వారికి ఉగాది (మార్చి 30వ తేదీ ఆదివారం) జరిగే కార్యక్రమంలో ప్రముఖులచే పురస్కారాలను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం స్థానిక బాలోత్సవ్ కమిటీ, వండర్ కిడ్స్, శాఖ గ్రంథాలయం, న్యాయవాది సతీష్ కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆకివీడు ప్రోత్సాహ సహకారాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

మా స్థలాన్ని ఆక్రమించారు.. న్యాయం చేయండి

పాతపాడు సర్పంచి లక్ష్మీ తులసి, ఆమె భర్త ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - మొగల్తూరు

ధ్వంసం చేస్తున్న స్థలాన్ని చూపిస్తున్న బాధితులు

గత 50 సంవత్సరాలుగా తమ కుటుంబానికి చెందిన స్థలాన్ని కొంతమంది వ్యక్తులు రాజకీయ పలుకుబడితో దౌర్జన్యంగా ఆక్రమించారని పాతపాడు సర్పంచి కొప్పాడ లక్ష్మీ తులసి, ఆమె భర్త ఉమామహేశ్వరరావు వారి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆదివారం పాతపాడులో ఏర్పాటు చేసిన విలేకరులతో బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులకు 18 ఎకరాల ఆక్వా చెరువులు ఉన్నాయన్నారు. తన మేనత్తకు చెందిన ఎకరం 10 సెంట్ల భూమిని దౌర్జన్యంగా ఆక్రమించి దానిలోని షెడ్డును ధ్వంసం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సాగు చేస్తున్న చెరువులో రొయ్యలు, చేపలు ఉన్నాయని వాటికి మేత వేసేందుకు అడ్డగిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినా రాజకీయ ఒత్తిడుల నేపథ్యంలో అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు.

న్యాయంగానే స్వాధీనం చేసుకున్నాం

నాగిడి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - మొగల్తూరు

కాళీపట్నంలో తమకు న్యాయంగా దక్కాల్సిన భూమిని స్వాధీనం చేసుకున్నామని నాగిడి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం కాళీపట్నంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. పాతపాడు సర్పంచి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నట్లు తాము ఎవరి ఆస్తులూ ధ్వంసం చేయలేదని ఆక్రమణకు పాల్పడలేదని తెలిపారు. సర్పంచి కుటుంబ సభ్యులు ఆటంకం కల్పిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ సమావేశంలో కోపనాతి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దేవ హర్షిణికి అభినందన

ఎన్‌సిసి పెరేడ్‌లో పాలకొల్లు విద్యార్థిని హర్షిణి

ప్రజాశక్తి - పాలకొల్లు

నైపుణ్యం, అంకితభావం, అద్భుతమైన ప్రదర్శనతో పాలకొల్లుకు చెంది కోరంగిలోని కెఐఇటి కళాశాల క్యాడెట్ సానబోయిన దేవ హర్షిణి, ప్రతిష్టాత్మక ఢిల్లీలోని రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొంది. ప్రతి క్యాడెట్ కల అయిన ఆల్ ఇండియా రిపబ్లిక్ డే క్యాంప్‌లో (ప్రైమ్ మినిస్టర్ ర్యాలీ-ఢిల్లీ) పాల్గొని గుర్తింపు పొందింది. ఆమె అసాధారణ ప్రదర్శన ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపు సంపాదించి పెట్టింది. ఈ క్యాంప్‌లో ఆమె అత్యుత్తమ నాయకత్వం క్రమశిక్షణ ప్రదర్శించింది. ఢిల్లీలో ప్రధాని, రాష్ట్రపతిని కలిసి కళాశాలకు తిరిగి వచ్చిన దేవ హర్షిణిని కళాశాల విద్యార్థి, అధ్యాపక సంఘం ఘనంగా స్వాగతించింది. కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, కేర్ టేకర్ అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ హాజరై ఆమె విజయాలను వివరించి ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలో దేవ హర్షిణి పాల్గొనడం తమ కళాశాలకు గర్వకారణమన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - ఆకివీడు

చెరుకుమిల్లి మంతెన దుర్గరాజు జిల్లా పరిషత్ హైస్కూల్ 1987-88 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ మధురానుభూతులను పంచుకున్నారు. పాఠశాల ప్రారంభంలో సన్నాయి మేళాలతో విద్యార్థులకు స్వాగతం పలికారు. సరస్వతి దేవీ, గాంధీజీ, వివేకానంద స్వామి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సమ్మేళనంలో సత్యారెడ్డి, మాధవి, ఇందిర, నాగేశ్వరరావు, రామరాజు, ఉష, లక్ష్మణరావు, తిలక్, సీతారామం పాల్గొన్నారు.

హాజరైన పూర్వ విద్యార్థులు

ఘనంగా 1008 కలశాలతో ఊరేగింపు

ప్రజాశక్తి - ఉండి

పెదపుల్లేరు గ్రామ దేవత సత్తెమ్మ అమ్మవారి 60వ జాతర మహోత్సవంలో భాగంగా రెండో రోజు ఆదివారం వేలా మంది మహిళలతో సుమారు 1008 కలశాల ఊరేగింపును కలిదిండి నరసింహరాజు (బాబు) కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, కనుమూరి రమాదేవి, కనుమూరి భరత్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్ నరసింహరాజు, ఎపిఐఐసి డైరెక్టర్ చనమల్ల చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్‌కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

'రాజశేఖరంను గెలిపించాలి'

ప్రజాశక్తి - మొగల్తూరు

యువతకు ఉపాధి, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని విప్ బొమ్మిడి నాయకర్, టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆదివారం మండలంలో పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. ఎన్నికల పరిశీలకులు గుత్తుల సాయి, వసవయ్య సూర్య నారాయణ రాజు కూటమి నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వారి వెంట నాయకులు గుబ్బల నాగరాజు, కలిదిండి కుమార్ బాబు, కత్తిమండ ముత్యాలరావు, నిప్పులేటి తారక రామారావు మామిడిశెట్టి సత్యనారాయణ ఉన్నారు.

నరసాపురం : పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని టిడిపి సీనియర్ నాయకులు సంకు భాస్కర్ నాయుడు అన్నారు. నరసాపురంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు సంకు భాస్కరనాయుడు ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి గోపాలరావు, గుడివాడ ప్రభాకరరావు, రావి అప్పాజీ పాల్గొన్నారు.

తణుకు రూరల్ : పట్టభద్రుల ఎంఎల్‌సి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కూటమి తణుకు నియోజకవర్గం పరిశీలకులు కడారి శ్రావణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాల మేరకు తణుకు 4వ వార్డులో పట్టభద్రుల ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని కొల్లేటి తీర గ్రామమైన కళింగగూడెంలో గ్రామదేవతలు పోలేరమ్మ, గంగానమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. అనంతరం అమ్మవారికి పూజలు వైభవంగా నిర్వహించారు. సిద్ధాపురంలో శివాలయ ప్రతిష్ట జరిగింది.

CHANGE OF NAME

I **SWATHI YENUMULA**, W/o. **YENUMULA MOHINDAR NAG** Resident of D.No.4-98/C, Bantty recidence Dum Dum gardens, Nuzvid town, Eluru District, A .P. I have changed my name **SWATHI YANUMULA** (old) to **SWATHI YENUMULA** (new) hance forth I am being called **SWATHI YENUMULA,** W/o **YENUMULA MOHINDAR NAG** in all purpose.

CHANGE OF NAME

I **YENUMULA MOHINDAR NAG** D.No 4-98/c Bantty recidence Dum Dum gardens, Nuzvid Town, Eluru District, A.P. I changed my Name **YENUMULA MOHINDRA NAG** (old Name) to **YENUMULA MOHINDAR NAG** (NewName) hance forth I am being called **YENUMULA MOHINDAR NAG** for all purpose.